క్లుప్తంగా

రేపు ఉచిత వైద్య శిబిరం

సుండుపల్లె : మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో మానవత సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు సంస్థ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైద్య శిబిరంలో అవసరమైన వారికి రక్త పరీక్షలు క్లినికల్ ల్యాబ్ వారిచే ఉచితంగా చేయించి మందులు అందజేయడం జరుగుతుందన్నారు. మండలంలోని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

వీధి దీపాలు ఏర్పాటు

పుల్లంపేట : మండల కేంద్రంలోని రెడ్డిపల్లి గ్రామ పంచాయతీలో స్థానిక సర్పంచ్ ఎల్లయ్య ఆధ్వర్యంలో శుక్రవారం ఎల్ఈడీ దీపాలకు మరమ్మతులు చేయించడంతోపాటు అవసరమైనచోట నూతన ఎల్ఈడీ బల్బులను ఏర్పాటు చేయించారు.

గృహ ప్రవేశ వేడుకలో ఆకేపాటి

సిద్దవటం : మండలంలోని మాధవరం-1 గ్రామంలో వైఎస్ఆర్‌సీపీ నాయకుడు వెంకట్రామిరెడ్డి నూతనంగా నిర్మించి గృహ ప్రవేశ వేడుకలకు గురువారం వైఎస్ఆర్‌సీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి హాజరైయ్యారు. ఈ సందర్భంగా ఆయన నూతన గృహాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్ఆర్‌సీపీ జిల్లా మైనార్టీ సెల్ కార్యదర్శి వల్లిచాన్, ఎంపీటీసీ శివయ్య, సర్పంచ్ జానకిరామయ్య, మాజీ సర్పంచ్‌లు కె.వి. సుబ్బయ్య, మేకపాటి సుబ్బారెడ్డి, వైఎస్ఆర్‌సీపీ మండల యూత్ కన్వీనర్ వావిళ్ల శ్రీనివాసులరెడ్డి, పార్టీ నాయకులు రోశిరెడ్డి, ఆరవ నారాయణరెడ్డి, జానపాటి సుబ్బరాయుడు, తదితరులు పాల్గొన్నారు.

నివాళి



నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే ఆకేపాటి

రాజంపేట టౌన్ : రాజంపేట ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గ్రంధే నాగసత్యనారాయణ గుప్తా సతీమణి లక్ష్మీకుమారి అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డి శుక్రవారం నూనెవారిపల్లెలోని మృతురాలి స్వగృహంలో మృతదేహాన్ని సందర్శించి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం సత్యనారాయణగుప్తాను ఓదార్చి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో కాకతీయ విద్యాసంస్థల అధినేత పోలా వెంకటరమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు



ఆలయంలో ఆకాశ దీపాన్ని వెలిగిస్తున్న భక్తులు

పుల్లంపేట : పుల్లంపేటలోని శ్రీ పర్వతవర్ధిని దేవి సమేత శ్రీ శాంతి లింగేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం కార్తీక శుద్ధ పాడ్యమిని పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు ఆలయంలో శ్రీ శివ పార్వతీ విద్యాసంస్థల కరస్పాండెంట్ సోము బాలాజీబాబు దంపతులు ఆకాశ దీపాన్ని వెలిగించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ప్రధాన అర్చకులు ఈశ్వరరావు, పండితులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

గ్రామ పరిశుభ్రతకు సహకరించండి

సిద్దవటం : మండల కేంద్రంలో శుక్రవారం పారుశుధ్య పనులు చేపట్టారు. గ్రామ సర్పంచ్ నాగరాణి ఆధ్వర్యంలో ఎగువపేటలోని బ్రాహ్మణవీధి, ఆంజనేయ స్వామి గుడికి వెళ్లే రహదారి, మరి కొన్ని ప్రాంతాల్లో పనులు చేపట్టారు. గృహిణులు పొడిచెత్త, తడిచెత్త వేరు చేసి చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయకుండా హరిత రాయభారుల వాహనంలో వేయాలని గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకునేందుకు అందరూ సహకరించాలని ఆమె అన్నారు.

రూటా జిల్లా అధ్యక్షుడిగా సిబాతుర్ రహిమాన్



రాయచోటి అర్బన్ : రూటా (రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్) అన్నమయ్య జిల్లా అధ్యక్షుడిగా ఎస్.ఎం.డి.సిబాతుర్ రహిమాన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం మదనపల్లెలో చిత్తూరు, అన్నమయ్య, తిరుపతి జిల్లాల ప్రాంతీయ సదస్సులో ఎన్నిక కార్యక్రమం జరిగింది. మహమ్మద్ అలీ, పీఎండీ ఇలియాస్‌ల పర్యవేక్షణలో ఎన్నికలు జరిగాయి. అధ్యక్షుడిగా సిబాతుర్ రహిమాన్ ఎన్నికకాగా, కార్యదర్శిగా అబ్దుల్ నాదిర్‌షా వలి, కోశాధికారిగా షేక్ ముహిబుల్లాలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ఇసుక టిప్పర్లు పట్టివేత

ఒంటిమిట్ట : ఒంటిమిట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో నాలుగు ఇసుక టిప్పర్లను స్వాధీనం చేసుకున్నట్లు ఒంటిమిట్ట ఎస్ఐ శివప్రసాద్ తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని మండపంపల్లి క్రాస్ వద్ద ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న నాలుగు టిప్పర్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు పేర్కొన్నారు. ఈ టిప్పర్లు నందలూరు చెయ్యేరు నది నుండి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్నాయని ఆయన తెలియజేశారు.



ఉదయం తెరుచుకోని అంగన్‌వాడీ కేంద్రం

'తెరుచుకోని అంగన్‌వాడీ కేంద్రం'

సిద్దవటం : మండలంలోని మాధవరం-1 గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న మహబూబ్‌నగర్ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం శుక్రవారం మూసేయడంతో గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ కేంద్రాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో మెరుగైన పౌష్టికాహారంను పిల్లలకు అందిస్తుందన్నారు. అంగన్వాడీ కేంద్రాన్ని మూసివేయడం ఏంటి అని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయమై సూపర్‌వైజర్ శ్రీవిద్యను వివరణ కోరగా మహబూబ్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రం నందు విధులు నిర్వహిస్తున్న అంగన్‌వాడీ టీచర్ లక్ష్మీప్రసన్న కడపకు వచ్చిందన్నారు. సీడీపీఓపై కొన్ని అభియోగాలు రావడంతో కొంత మంది అంగన్‌వాడీ వర్కర్‌లు కడపకు వచ్చారని, మధ్యాహ్నం నుంచి పిల్లలకు అంగన్‌వాడీ కేంద్రం అందుబాటులోకి వచ్చిందని ఇక మీదట ఇలాంటి సమస్యలు లేకుండా చూస్తామని ఆమె అన్నారు.

నిర్లక్ష్యం పెరిగింది.. మురుగు పారింది

రాయచోటి : పారిశుధ్య కార్మికుల నిర్లక్ష్యం, పర్యవేక్షక అధికారుల లోపం ఫలితంగా మురుగునీరు రోడెక్కి పారుతోంది. కాలువలలో పేరుకుపోయిన చెత్తను తొలగించి దుర్గంధపు భరితంగా మారిన దుస్థితి నుంచి రోడ్డుపై పారుతున్న మురికినీటి ప్రవాహం నుంచి కాపాడాలని జిల్లా కేంద్రం పరిధి ఎస్ఎన్ కాలనీలో వెంకటేశ్వరస్వామి గుడి పరిసర ప్రాంతాల ప్రజలు వేడుకుంటున్నారు. వెంకటేశ్వరస్వామి ఆలయం సమీపంలో ఉన్న డ్రైనేజీ కాలువ పూర్తిగా చెత్తాచెదారంతో నిండిపోయింది. ఆ కాలువలో నుంచి మురుగునీరు పొంగి పొర్లుతోంది. ఈ సమస్యతో వాహనదారులు, కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మున్సిపల్ కమిషనర్ అయినా స్పందించి వార్డులలో పర్యటించి కాలువలలో పేరుకుపోయిన చెత్తను తొలగింప చేయించి రోగాల బారిన పడకుండా చూడాలని ప్రజలు కోరుకుంటున్నారు.



వెంకటేశ్వర స్వామి గుడి వద్ద రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు

గతుకుల రోడ్లు.. దినదినగండాలు

- రామాపురం మండలంలో దారుణంగా గ్రామీణ రోడ్లు
- రోడ్ల నిర్మాణం చేపట్టాలంటున్న ప్రజలు
- పట్టించుకోని మండల ప్రజాప్రతినిధులు, అధికారులు



కంకర తేలిన కల్పనాయునిచెరువు - మూలపల్లె మార్గం



నీలకంట్రావుపేటలో కొద్దిపాటి వర్షానికి రోడ్డుపై నిలిచిన నీరు

రామాపురం : అసలే గ్రామీణ రహదారులు, ఆ రహదారులలో ప్రయాణమంటే ప్రజలు జడుస్తున్నారు. మండలంలోని 13 గ్రామ పంచాయతీలుండగా 16 ప్రధాన రహదారులతోపాటుగా 108 గ్రామీణ రహదారులు ఉన్నాయి. ఇందులో 10 లేక 12 మార్గాలు మినహాయిస్తే మిగతావి కడుదుర్భరంగా మారాయి. గ్రామీణ రోడ్లల్లో గుంతలు తేలి అడుసులుగా మారి కంకర రాళ్లు పక్కకు పోయి దుర్భరంగా తయారయ్యాయి. నిద్రలేచినప్పటి నుండి కూరగాయలు, ఇతరత్రా వ్యాపారులు ద్విచక్రవాహనంలో, ఆటోలలో వెళ్లాల్సి ఉంటుంది. మండలంలోని మూలపల్లె నుంచి కల్పనాయునిచెరువు రహదారి పాదచారులు సైతం వెళ్లలేని స్థితిలో ఉంది. నీలకంట్రావుపేట నుండి సీకే రోడ్డు, దర్గా వరకు దారి అలాగే ఉంటుంది. సుద్దమళ్లపల్లె రోడ్డు, సరస్వతి పల్లె రోడ్డు, నాయునివారిపల్లె రోడ్డు, నల్లగుట్టపల్లె గ్రామం హరిజనవాడ రోడ్డు, బోయపల్లె రోడ్డు వరకు దారుణమైన స్థితికి చేరుకున్నాయి. రాచపల్లె పంచాయతీలో బీదవాండ్లపల్లె నుండి బాలిరెడ్డిగారి పల్లె, కొమ్మూరివారిపల్లె, వడ్డెపల్లె రోడ్డు, నాయునివారిపల్లె, చిట్లూరు గ్రామం హరిజనవాడలకు వెళ్లే దారులు కుమ్మరపల్లె పంచాయతీల్లో దూదేకులపల్లె, ఆర్.వి.రోడ్డు నుండి మన్నేరువాండ్లపల్లె రోడ్డు, గన్‌సీదా దర్గా నుండి పాత్తుకూరుపల్లె రోడ్డు మొత్తం గుంతలమయంగా మారాయి. హసనాపురం గ్రామంలో పెడబల్లె, హరిజనవాడ రోడ్డు, రాచపల్లె నుండి హసనాపురం వెళ్లే రోడ్డు ఇతరత్రా గ్రామీణ రోడ్లు చాలా దీనంగా మారాయి. మండలంలో దాదాపు అన్ని సింగల్ రోడ్లే. కాగా, ఆ రోడ్లు కూడా గతుకులమయంగా మారడం అందునా సుమారు 10 వరకు కంకర పరిశ్రమలున్నాయి. వీటికి సంబంధించిన టిప్పర్లు, ఇతర వాహనాలు నిత్యం రాత్రింబవళ్లు ఈ రహదారులలో వెళ్లాల్సి ఉంటుంది. దీంతో ఓ వైపు ద్విచక్రవాహనాలు, ఆటోలు, ప్రైవేటు పాఠశాలల బస్సులు నిరంతరం ఈ రహదారులలో ప్రయాణం దినదినగండంగా మారుతున్నాయి. అరచేతిలో తమ ప్రాణాలు పెట్టుకుని ప్రయాణాలు చేయాల్సి వస్తోందని విద్యార్థులు, గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు దారుణస్థితిలో ఉన్న ఈ మార్గాలకు నూతనంగా వేసి తమకు ఇబ్బందులు లేకుండా చూడాలంటూ మండలవాసులు విన్నవిస్తున్నారు.

ప్రయాణం నరకం



ఈ రహదారులలో ప్రయాణం నరకప్రాయంగా ఉంది. ఇంటికి చేరేలోపు ఆస్పత్రికి వెళ్లేలా రోడ్లు తయారయ్యాయి. దశాబ్దాల తరబడి మరమ్మతులకు గ్రామీణ రోడ్లు నోచుకోకపోవడం గ్రామీణ ప్రజలకు శాపంగా మారింది. ఇప్పటికైనా ప్రభుత్వం ప్రజల ఇబ్బందులను పరిగణలోకి తీసుకొని రోడ్లపై శ్రద్ధ వహించి రోడ్ల నిర్మాణం చేపట్టాలి.

– పి.అయూబ్‌ఖాన్, నీలకంట్రావుపేట, రామాపురం

దారులన్నీ గుంతలమయం



రహదారులన్నీ గుంతలమయంగా మారాయి. పాలకులు గ్రామీణ రోడ్ల మరమ్మతులకు నిధుల మంజూరు చేయాలి. పాలకులు వస్తున్నారు.. పోతున్నారు కానీ గ్రామీణ రోడ్లను బాగు చేసే ఆలోచన చేయడంలేదు. ఈ రోడ్లపైన బండి నడపాలంటేనే భయంగా ఉంది. ఇప్పటికైన అధికారులు స్పందించి రోడ్ల మరమ్మతులకు చర్యలు తీసుకోవాలి.

– ఎస్. ఇర్షాద్, రామాపురం మండలం

ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలి

గ్రామీణ ప్రాంతాల్లో వర్షాల కారణంగా దెబ్బతిన్న రోడ్లను గుర్తించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతాం. ప్రజల నుండి వచ్చిన ఫిర్యాదులను దృష్టిలో పెట్టుకొని రోడ్ల మరమ్మతులకు చర్యలు చేపడతాం. నిధులు మంజూరైన వెంటనే పనులు చేపడతాం. ఇందులో గ్రామీణ అప్రోచ్ రోడ్లుగా ఉన్నావాటిలో ఆర్అండ్‌బీ, పీఆర్, ఇతర పరిధిలో ఉన్న వాటి పరిధిలో ప్రతిపాదనలు సిద్ధం చేశాం.

– జగదీష్, జేఈ, పీఆర్, రామాపురం మండలం

భద్రకాళికి పూజలు



ప్రత్యేక అలంకరణలో భద్రకాళి

రాయచోటి టౌన్ : రాయచోటి శ్రీ భద్రకాళి అమ్మవారికి రాహుకాల పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శుక్రవారం అమ్మవారికి ఆలయ ప్రధాన అర్చకులు అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని అందంగా అలంకరించారు. అనంతరం మహిళలు అమ్మవారికి నిమ్మకాయలపై వత్తులు వెలిగించి హారతులు పట్టారు. భక్తులకు ప్రధాన అర్చకులు రాహుకాల పూజల విశిష్టతను తెలియజేశారు. తరువాత భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

లక్కిరెడ్డిపల్లి : గ్రామ ఉద్యాన అసోసియేషన్ రాష్ట్ర అదనపు జనరల్ సెక్రటరీగా వీరబల్లి శ్రీకాంత్ ఎన్నికయ్యారు. ఈ మేరకు ఆయన ఇక్కడి విలేకరులకు తెలియజేశారు. అన్ని జిల్లాల గ్రామ ఉద్యాన ఉద్యోగులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ ఫణీంద్ర తెలిపారన్నారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ గ్రామ ఉద్యాన ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు. తన ఎంపికకు సహకరించిన ఉద్యోగులకు ధన్యవాదాలు తెలిపారు.

ఆలయానికి రాజ్యసభ ఎంపీ మేడా విరాళం

నందలూరు : మండలంలోని నాగిరెడ్డిపల్లి పంచాయతీ అరవపల్లి గ్రామంలోని శ్రీ కోదండరామ స్వామి దేవస్థాన పునర్నిర్మాణానికి రాజ్యసభ సభ్యులు మేడా రఘునాథరెడ్డి రూ.5 లక్షలు విరాళాన్ని ప్రకటించినట్లు ఆలయ ధర్మకర్త గంపా సుధాకర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన శుక్రవారం మాట్లాడుతూ ధర్మకర్త మండలి సభ్యులు అందరూ కలిసి అరవపల్లిలో నిర్మాణంలో ఉన్న ఆలయ నిర్మాణానికి సహకరించాల్సిందిగా మేడా రఘునాథరెడ్డిని కోరగా ధ్వజస్తంభం ఇత్తిలి తొడుగు పూర్తిగా ఏర్పాటు చేయుటకు, ఇతరత్రా నిర్మాణాలకు రూ. 5 లక్షలు విరాళాన్ని ప్రకటించారన్నారు. అలాగే రాబోయే రోజుల్లో ఏదైనా అవసరం వస్తే సహాయం చేస్తానని తెలియజేశారు. అనంతరం శాలువాతో మేడాను ఆలయ కమిటీ సభ్యులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ధర్మకర్త మండలి సభ్యులు నడివీధి సుధాకర్, పి.మహేష్, కె.శివప్రసాద్, ఎ.శ్రీచరణ్‌లు పాల్గొన్నారు.



ఎంపీ మేడాను సత్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

యూటీఎఫ్ మహాసభను జయప్రదం చేయండి

రాజంపేట టౌన్ : ఈనెల 3వ తేదీ మదనపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగే యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభను జయప్రదం చేయాలని ఆ యూనియన్ జిల్లా అధ్యక్షుడు బిళ్లా హరిప్రసాద్ పిలుపునిచ్చారు. మహాసభ పోస్టర్‌ను శుక్రవారం ఆయన యూటీఎఫ్ నాయకులతో కలిసి రాజంపేటలో విడుదల చేశారు. ఈ సందర్భంగా హరిప్రసాద్ మాట్లాడుతూ విద్యారంగ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా గత యాభై సంవత్సరాలుగా యూటీఎఫ్ అలుపెరగని పోరాటం చేస్తోందన్నారు. తమ యూనియన్ పోరాటాల ఫలితంగా అనేక సమస్యలు పరిష్కారం అయ్యాయని తెలిపారు. మహాసభల్లో యూటీఎఫ్ రాష్ట్ర నాయకులు పాల్గొంటారన్నారు. ఈ సభలో విద్యారంగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన కార్యాచరణను రూపొందించనున్నట్లు తెలిపారు. అందువల్ల జిల్లాలోని యూటీఎఫ్ నాయకులు, కార్యకర్తలు, ఉపాధ్యాయులు పెద్దఎత్తు మహాసభలో పాల్గొనాలని కోరారు. ఈకార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు డి.చెంగల్‌రాజు, జి.నాగేంద్ర, వెంకటరమణ, లింగప్పనాయుడు, చిన్నగంగయ్య పాల్గొన్నారు.



పోస్టర్‌లను విడుదల చేస్తున్న నాయకులు

ఘనంగా రాష్ట్రీయ ఏక్తా దివస్ వేడుకలు



లక్కిరెడ్డిపల్లి: ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ఏక్తా దివస్ వేడుకలు

లక్కిరెడ్డిపల్లి : ఏపీయూఎస్ మండల శాఖ ఆధ్వర్యంలో సర్దార్ వల్లబ్‌భాయ్ పటేల్ జయంతిని స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.రామాంజనేయ ప్రసాద్ మాట్లాడుతూ సర్దార్ పటేల్ ఉక్కు మనిషిగా పేరుపొందిన గొప్ప దేశభక్తుడని పేర్కొన్నారు. జిల్లా అధ్యక్షులు నరసింహులు మాట్లాడుతూ హైదరాబాదు, జునాఘడ్ ప్రాంతాలకు హోంశాఖ మంత్రిగా ఉంటూ సైనిక చర్య ద్వారా భారతదేశంలో విలీనం చేసిన గొప్ప సమైక్యవాది పటేల్ అని కొనియాడారు. అలాగే దేశ మొదటి ఉప ప్రధానిగా పని చేస్తూ దేశానికి సంబంధించిన అనేక సమస్యలను ఉక్కు సంకల్పంతో పరిష్కరించారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మీడియా ఇన్‌చార్జ్ కె.వెంకటేశ్వర్లు, మండల గౌరవ అధ్యక్షులు రామాంజనేయులు, జిల్లా సేవా ప్రముఖులు ఎం.మల్లయ్య, ఆపస్ నాయకులు సుబ్బారెడ్డి, టి.సాయిశరణ్ యాదవ్, కె.నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

చిట్వేలిలో..



చిట్వేలి: నివాళులర్పిస్తున్న ఐసీడీఎస్ అధికారులు

చిట్వేలి : ఉక్కు మనిషి సర్దార్ వల్లబ్‌భాయ్ పటేల్ జయంతిని ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం సీడీపీఓ రాజేశ్వరీ మాట్లాడుతూ భారతదేశ భూభాగంలోని స్వదేశీ సంస్థానాలను విలీనం చేసి దేశ సమైక్యతను కాపాడిన ధీరుడు పటేల్ అని కొనియాడారు. అనంతరం ఏక్తా దివాస్ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో గ్రేడ్-1 సూపర్‌వైజర్లు వసుందరమ్మ, విశాలాక్షి తదితరులు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములుకు నివాళి



పొట్టి శ్రీరాముల విగ్రహానికి నివాళి అర్పిస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

రాయచోటి టౌన్ : రాయచోటి పట్టణంలో ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమర వీరుడు పొట్టి శ్రీరాములు విగ్రహానికి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పూల మాల వేసి ఘనంగా నివాళి అర్పించారు.

కారు ఢీ కొని వ్యక్తికి గాయాలు

గాలివీడు : గాలివీడు – కొనంపేట రహదారిలోని పెట్రోల్ బంక్ వద్ద కారు స్కూటరిస్ట్ ఢీకొన్న సంఘటన శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. అవులశెట్టివారిపల్లెకు చెందిన మోడెం ఈశ్వరయ్య పెట్రోల్ బంకు నుంచి ఇంటికి వెళ్లే సమయంలో గాలివీడు నుంచి నూలివీడు వెళుతున్న గుర్తుతెలియని కారు ఢీ కొనడంతో కుడి మోకాలుకు గాయాలయ్యాయి. ప్రైవేటు వాహనంలో రాయచోటికి తరలించారు. సంఘటన స్థలానికి ఎస్ఐ రామకృష్ణ పరిశీలించి కేసు నమోదు చేశారు.

రైల్వేలో జోరందుకున్న ఎన్నికల ప్రచారం

రాజంపేట : గుంతకల్లు – రేణిగుంట మార్గంలోని వివిధ రైల్వేస్టేషన్‌లలో గుర్తింపు ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. నేరుగా మజ్దూర్ యూనియన్, ఎంప్లాయిస్ సంఘ్ నేతలు నేరుగా కార్మికుల వద్దకు వెళ్లి ఓటు అడుగుతున్నారు. ఉభయజిల్లాలో తమ తమ బ్రాంచీల వారీగా నేతలు ఓట్లను అడుగుతున్నారు. సెక్షన్ల వారీగా ప్రచార పర్యటనలకు నేతలు శ్రీకారం చుట్టారు. ఆల్ ఇండియా రైల్వేమెన్ ఫెడరేషన్(ఏఐఆర్ఎఫ్), నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ రైల్వే (ఎన్ఎఫ్ఐఆర్)లు కార్మికులకు సాధించి పెట్టిన అంశాలనే ప్రచార అస్త్రాలుగా చేసుకొని ముందుకెళుతున్నారు.

డిసెంబరు 4, 5, 6 తేదీలలో

ఓపెన్‌లైన్ స్టాఫ్‌కు 4, 5 రెండురోజుల్లో ఏదో ఒక రోజులో కార్మికుడు ఓటు హక్కును వినియోగించుకోవాల్సి ఉంటుంది. అలాగే రన్నింగ్ స్టాఫ్ 4, 5, 6 తేదీలలో తమ ఓటును వినియోగించుకునే వీలుంటుంది. భాకరాపేట నుంచి ఓబులవారిపల్లె వరకు గుంతకల్ ఏడీఎస్ (మజ్దూర్ యూనియన్) మధుసూదనరావు, నందలూరు బ్రాంచీ సెక్రటరీ కె.విశ్వనాథ, అసిస్టెంట్ సెక్రటరీ ఎంఎస్ బాషా, బి.సిద్దయ్య, రైల్వే ఇన్‌స్టిట్యూట్ కోశాధికారి శ్రీహర్ష, బీఈసీ సభ్యుడు క్రాంతికుమార్ తదితర కార్మిక నేతలు ఓటువేయాలని కార్మికులను అభ్యర్థించారు.



ఎన్నికల ప్రచారంలో మజ్దూర్ యూనియన్ నేతలు

డీఈఓను కలిసిన ఎస్టీయూ నాయకులు

పెనగలూరు : జిల్లా విద్యాశాఖాధికారి సుబ్రమణ్యంను రాష్ట్ర ఎస్టీయూ కౌన్సిలర్ పిల్లి రామకృష్ణ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా డీఈఓతో పలు సమస్యలపై చర్చించినట్టు తెలిపారు. విద్యార్థులు అధికంగా ఉండి ఉపాధ్యాయులు తక్కువగా ఉన్నట్లెతై వలంటీర్ల వ్యవస్థను ఏర్పాటు చేసి విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరినట్లు తెలిపారు.



డీఈఓను సత్కరిస్తున్న ఎస్టీయూ నాయకులు

ప్రతి ఇంటా దీపావళి వెలుగులు నిండాలి

రాజంపేట రూరల్ : జిల్లాలోని ప్రతి ఇంటిలో సుఖ, సంతోషాలతో కూడిన దీపావళి వెలుగులు నిండుకోవాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి ఆకాంక్షించారు. మండల పరిధిలోని ఆకేపాటి ఎస్టేట్‌లో గురువారం ఘనంగా దీపావళి సంబరాలను ఎమ్మెల్యే ఆకేపాటి, జ్యోతమ్మ దంపతులు నిర్వహించుకున్నారు. దీపాలు వెలిగించి, బాణసంచా కాల్చుతూ ప్రతి ఒక్కరికి దీపావళి శుభాకాంక్షలు తెలుపుతూ అన్నప్రసాదం అందజేస్తూ వేడుకగా నిర్వహించుకున్నారు. అదే విధంగా దీపావళి శుభాకాంక్షలు తెలిపేందుకు ఉభయ జిల్లాలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, వివిధ విభాగాల కన్వీనర్లు, కార్యకర్తలు, ఆకేపాటి ఎస్టేట్‌కు చేరుకున్నారు. వారి సమస్యలను ఎమ్మెల్యే ఆకేపాటి ఆరా తీశారు. ప్రతి ఒక్కరికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు.

పరామర్శ

తాళ్లపాక గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త రేనాటి సాంబశివరాజు ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. తాళ్లపాకలోని అతని స్వగృహానికి ఎమ్మెల్యే ఆకేపాటి శుక్రవారం వెళ్లి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ మాజీ కమిటీ చైర్మన్‌లు చొప్పా ఎల్లారెడ్డి, పీసీ యోగీశ్వరరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పి.విశ్వనాథరెడ్డి, దండు గోపీ, బి.శేఖర్‌రాజు, జీవీ సుబ్బరాజు, దాసరి పెంచలయ్య, అరిగెల సౌమిత్రి తదితరులు పాల్గొన్నారు.



సంబేపల్లె: దీపావళి వేడుకలో చిన్నారులు



రాజంపేట రూరల్: బాణసంచా కాలుస్తున్న ఆకేపాటి

ఘనంగా దీపావళి వేడుక

సంబేపల్లె/సిద్దవటం : వివిధ గ్రామాల్లోని ప్రజలు గురువారం రాత్రి దీపావళి పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మీదేవి అమ్మవారికి మహిళలు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు చేశారు. చీకటి పోయి తమ జీవితాల్లో వెలుగు నిండాలని పిల్లలు, పెద్దలు అనే తేడాలేకుండా దీపాలు వెలిగిస్తూ, బాణసంచాలు పేల్చారు.

ఘనంగా లక్ష్మీపూజ

రామాపురం : హిందువుల పండుగల్లో విశిష్టమైన పండుగ దీపావళి. దీపావళికి లక్ష్మీదేవిని భక్తిశ్రద్ధలతో పూజించడం ఆనవాయితీ. దీపాల వరుసలతో ఆశ్వీజంలో అమ్మవారికి చక్కగా అమావాస్య రోజున పూజించడం, అలాగే కార్తీకమాసాన్ని స్వాగతించడం హర్షనీయం. మండలంలోని నీలకంట్రావుపేటలోని అమ్మవారిశాలలో వాసవీ కన్యాకాపరమేశ్వరీ ఆలయంలో లక్ష్మీపూజ ఘనంగా నిర్వహించారు.



రామాపురం: లక్ష్మీపూజ అందుకున్న వాసవీమాత

టీడీపీ నాయకుల అక్రమ ఇసుక రవాణా



వాహనాలను స్వాధీనం చేసుకున్న తహసీల్దార్

నందలూరు : మండలంలోని కుందానెల్లూరు సమీపంలోని పాత ఇసుక రీచ్‌లో శుక్రవారం అక్రమంగా ఇసుకను తరలిస్తున్న టీడీపీ నాయకులకు చెందిన నాలుగు టిప్పర్లు, రెండు లారీలు, ఒక జేసీబీ, ఒక హిటాచ్‌ని సీజ్ చేసినట్లు తహసీల్దార్ అమర్నాథ్ పేర్కొన్నారు. సీజ్ చేసిన వాహనాలు తహసీల్దార్ కార్యాలయం వద్ద ఉంచినట్లు వారు తెలియజేశారు. అనుమతులు లేకుండా ఇసుక తరలించేవారు ఎంతటివారైనా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇసుక కోసం ప్రభుత్వ అనుమతి అని తెలయజేశారు. ఈ కార్యక్రమంలో వీఆర్ఓ శివ, స్థానిక పోలీసులు పాల్గొన్నారు.